135

# వంతెన

అతను అఖాతం లాంటి లోయలో ఉన్నాడు. ఎదురుగా ఎత్తయిన కొండలు. కొండమీదినుంచి చూస్తే లోయ ఎలా కనిపిస్తోందో అతనికి తెలీదు. లోయలోంచి చూస్తే మాత్రం ఆ కొండ చాలా ఎత్తుగా కన్పిస్తుంది. ఇంకా చాలాసేపు చూస్తే మెడలాగేటంత ఎత్తుగా, తలపాగా జారి కిందపడేటంత ఎత్తుగా అవుపిస్తుంది. కొండ అంచున కన్పించే పెద్ద పెద్ద భవనాలూ, ఇంకా కొంచెం లోపలగా ఉన్న భవనాల శిఖరాలూ తప్ప, కొండమీదగాని, కొండకి అవతలగానీ ఏముందో అతనెరగడు.

కొండకు ఆనుకునే పెద్ద మర్రిచెట్టు ఒకటుంది. దాని ఊడలు కూడా నేలమీదికి దిగి చెట్టు కాండం అంత లావుగా బలిసిపోయేయి. ఆ చెట్టు ఏనాటిదో ఎవరికీ తెలీదు.

ఆ చెట్టుకు పక్కనే అతని ఇల్లు ఉంది. అది జమ్ముగనేసిన పెద్ద గుడిసె. ఆ యింటి ముందు, మర్రి చెట్టు నీడలో, ఊడకు నడుం వాల్చి కూర్చొన్నాడు మోటూనాయక్. అతను మోటుగా ఉండడు. తాటగానే వుంటాడు. ఒకప్పుడు.... అంటే.... వయసులో ఉన్నప్పుడు మోటుగా ఉండేవాడేమో!

మోటూనాయక్ మర్రి ఊడకు నడుంవాల్చి కూర్చొన్నాడు. అతని ఒడిలో తలపెట్టుకొని కూతురు మోతీ పడుకుని ఉంది. ఆమె దృష్టి ఎప్పుడూ పక్కనున్న కొండమీదనే ఉంటుంది.

ఆ కొండమీద ఏముంది బాబా?'' అనడిగింది మోతీ.

"ఏమో బిడ్డా! నాకు మాత్రం ఏమెరుక? ఎవురో గొప్పోళ్ళే ఉండి ఉంటారు. ఒకప్పుడు అక్కడా మనవాళ్ళే ఉండేవారంట'' అని చెప్పేడు మోటూనాయక్.

ఆమెకు నమ్మకం కుదర్లేదు.

"ఉత్తుది. ఉంటే ఎక్కడికి పోతారేంటి?'' అని ఆశ్చర్యాన్ని ప్రకటించింది మోతీ.

అవును. ఎక్కడికి వలసపోయి ఉంటారో?

తనుమాత్రం ఆ నేలని పట్టుకు వదల్లేదు. అదే తనకు జీవితం. తన కండలు... ఎముకలు అంతా ఆ నేలే!!

కొండమీది నుంచి సన్నని నీటిధార జెర్రిపోతులా జారుతోంది.

"ఆ నీల్లెక్కడినుంచొస్తాయి బాబా?" మోతీ నుంచి మరో ప్రశ్న.

"ఏమో బిడ్డా! నాకూ తెల్వదు. కాని ఆ నీల్లే మనకి కూడెడతన్నాయి" అని చెప్పేడు.

ఎలాగని అడగలేదు. ఆలోచించనూ లేదు. ఆ రెంటికీ అతీతమైన వయస్సు ఆమెది. మెల్లగా లేచి తల్లి దగ్గరకు వెళ్లిపోయింది.

కొండమీదినుంచి జారే ఆ నీరు అలా కిందికి ఎక్కడికో పారి వృధాగా నేలలోకి ఇంకిపోయేది. అలా జరక్కుండా తన తండ్రి కాలంనాడే మూడు వైపులా కట్టలు వేసి చెరువులా తయారు చేసుకున్నారు. ఆ నీటితో ఎంతో కొంత నేల సాగుచేసుకుని పంట పండించుకొంటున్నారు. ఆ నీరుకూడా ఏడాది పొడుగునా ఉండదు. శీతాకాలం సగం రోజుల వరకే అలా జారుతుంది. ఆ తర్వాత ఒక్క చుక్కకూడా కింద పడదు.

ఆ చిన్న చెరువుకు దిగువగా కొంత చదునైన భూమి ఉంది. అది పశ్చిమం వైపు కొంచెం ఒంపుగా వుంటుంది. అటువైపు భూమి సారవంతమైంది. వాళ్ళతాత ముత్తాతల నాటి నుంచి రాళ్ళు కొట్టి చదును చేసి ఫలవంతం చేసిన నేల అది. అక్కడ కూరగాయలు పండిస్తారు. మిగిలిన నేలలో నీరు నిలబడుతుంది. అంచేత అక్కడ వరి పండిస్తారు.

మోటూనాయక్ భార్య పేరు ఏదో గమ్మత్తుగా ఉంటుంది. ఆమె ఎర్రగా వుంటుంది. సన్నగా పొడుగ్గాకూడా ఉంటుంది. ఆరుగురు పిల్లల తల్లి. మిగిలింది ముగ్గురే. ఇద్దరబ్బాయిలూ ఒక అమ్మాయి.

లంబాడీల్లో ఇంటిల్లిపాదీ కష్టపడి పనిచేస్తారు. ఇక్కడ మాత్రం పనిచేసేవాడు పెద్దవాడొక్కడే. రెండోవాడు పొలం పని ముట్టుకోడు. ఏం పని చేస్తాడో ఇంట్లో ఎవ్వరికీ తెలీదు. అయితే అతను ఇంటి పట్టునమాత్రం ఉండడు. ఎప్పుడూ ఎక్కడెక్కడో తిరిగి వస్తూ ఉంటాడు. అయినా అతను చిన్నవాడుకావటమో, లేక సోమరిలే పొమ్మని వదిలేయటమో కారణం కావచ్చు.

కొండమీదినుంచి మోటూనాయక్ ఇంటికి దిగాలంటే కాలువలాంటి మరో కయ్యి దాటాలి. అలా దాటటానికి అక్కడో చిన్న కర్ర వంతెన ఉంది. అది ఎవరు కట్టేరో

ఎప్పుడు కట్టేరో మోటూనాయక్ కూడా ఎరగడు. ఇప్పుడు రెండు మూడు చెక్కలు తప్ప వంతెన మీద ఏమీ లేదు. అయినా దాన్ని ఉపయోగించేవారెవరు?

ఊడల మర్రికి నడుం వాల్చి ఏదో ఆలోచిస్తున్నాడు మోటూనాయక్. ఆకస్మాత్తుగా వంతెన వైపు నుంచి శబ్దం వినిపించింది. లేచి చెవులకు చేతులు అడ్డం పెట్టుకుని ఆలకించేడు. టక్ టక్‌మని ఏదో కర్రలు కొడుతున్న శబ్దం వినిపిస్తోంది. కాని ఏమీ కనిపించటంలేదు. ఇంట్లో ఉన్న మోతీని పిలిచేడు.

"సూడు బిడ్డా! నీకేమైన సప్పుడు ఇనొస్తందా?"అనడగేడు.

"అవ్, అక్కడెవరో ఇద్దరు మనుసులు కర్రలు కొడ్తన్నారు"

"దేనికి?" అనడిగేడు.

"ఒంతెనకి" అని చెప్పేసి లోపలికెళ్ళిపోయింది మోతీ. అతనికేమీ అర్థం కాలేదు.

అప్పుడే పెద్ద కొడుకు పశువుల్ని తోలుకుని అటువైపు వెళుతోంటే పిల్చి అడిగేడు మోటూ-

"ఏందిరా ఆ సప్పడు?" అని

"ఒంతెన బాగుచేస్తన్నారు" అని చెప్పేడు.

అంతకు మించి అతనికీ ఏమీ తెలీదు.

ఆ వంతెన ఎవరు బాగుచేస్తున్నదీ, ఎందుకు బాగుచేస్తున్నదీ మోటూనాయక్‌కు అర్థం కాలేదు. ఒకప్పుడు, ఆ కొండమీది లంబాడీలు ఉండే రోజుల్లో వాళ్ళు ఆ వంతెన మీది నుంచి తరచూ వస్తూ ఉండేవారు. వాళ్ళు అక్కడినుంచి వలసపోయేక ఆ వంతెన ఎవరూ వాడటంలేదు. అటువైపు వచ్చే అవసరమూ ఎవరికీలేదు. ఇంతకాలం తర్వాత దాన్ని బాగుచేసే అవసరం ఎవరికి కలిగింది?

అదీ అతని సందేహం. కాని తీర్చేదెవరు?

కొంచెం లోకజ్ఞానం తెల్సినవాడు చిన్న కొడుకు ఒక్కడే. రాత్రి అతను ఇంటికి రాగానే అడిగేడు మోటూ-

"ఒంతెన బాగుజేస్తన్నారంట ఎవురు"అని .

"ఎవరైతేనేమిలే. ఒంతెన మాత్రం బాగుజేస్తన్నారు. మన బతుకులకి ఏదో ముప్పు రాబోతున్నాది" అన్నాడు సాలోచనగా.

వంతెన బాగుచెయ్యటానికీ, తమ బతుకులకి ముప్పురావటానికీ సంబంధం ఏమిటో ఆ యింట్లో ఒక్కరికీ అర్థం కాలేదు. అర్థం అయిన ఒక్కడూ నోరు విప్పడు. విప్పి విడమర్చి చెప్పడు.

వంతెన పూర్తిగా బాగుపడింది.

ఆ తర్వాత రెండు రోజులకి ప్రభుత్వం జీప్ ఒకటి మోటూ ఇంటిముందు ఆగింది. అతను ఎప్పట్లానే మర్రి ఊడకు చేరగిలబడి కూర్చున్నాడు. జీపును చూడగానే కంగారుగా లేచి నిలబడ్డాడు. జీపులోంచి ఇద్దరు మనుషులు దిగేరు.

"మోటూనాయక్ అంటే ఎవరు?" అందులో ఒక వ్యక్తి అడిగేడు.

"నేనే బాబూ" అన్నాడు మోటూ చేతులు రెండూ జోడించి.

"మేం రెవిన్యూ అధికారులం"

"అంటే యేంటి బాబూ!" అనడిగేడు మోటూ.

"అంటే మేం సర్కారు మనుషులం"

"అలాగా బాబూ! ఎందుకొచ్చారో?'

"నిన్ను ఈ భూమిలోంచి తప్పుకోమని చెప్పటానికొచ్చేం. ఇది సర్కారు ఆజ్ఞ"

మోటూనాయక్‌కు ఇదేం అర్థంకాలేదు. తన భూమిలోనించే తనను తప్పుకో మంటున్నారేవిటి వీళ్ళు అని ఆశ్చర్యపోయేడు.

"మీరు సెప్పిందేమిటో తెలవటంలేదు బాబూ"

"ఈ భూమి మీది కాదు. సర్కారుది. అందుకే లేచిపొమ్మంటున్నారు"

"అదేంటి బాబూ! మా తాతల తాతల నాటినుంచీ ఇక్కడ్నే ఉంటున్నాం. ఆ మాట ఎవరూ సెప్పలేదే?"

"అప్పుడు సర్కారుకు అవసరం లేకపోయింది. ఇప్పుడు అవసరం వచ్చింది"

"ఇంతకీ సర్కారుకు మా బూమే ఎందుకు కావల్సొచ్చింది దొరలూ?" అని అడిగేడు మోటూనాయక్.

"అడిగేవు కాబట్టి చెబుతున్నాం, విను. పైన కొండమీద బంగ్లాల్లో ఉంటోన్న పెద్ద పెద్ద దొరలకీ వాళ్ల భార్యలకీ విహారానికి స్థలం కావాలిట. అందుకు సర్కారు ఇక్కడ ఓ సరదా పార్కు కట్టడానికి స్కీము వేసింది"

"అంటే ఏంటి దొరా?"

"అదంతా చెబుతూ కూర్చోడానికి మాకు టైం లేదు. పది రోజులు టైమిస్తున్నాం. ఈలోగా మీరు భూమిని ఖాళీచేసి వెళ్లిపోవాలి" అని జీపెక్కి వెళ్ళిపోయేరు వాళ్లు.

మోటూనాయక్ భార్య ఇంట్లో గుమ్మం దగ్గర నిలబడి సంభాషణ అంతా విన్నది. జీపు వెళ్ళగానే లబోదిబోమంటూ బయటికొచ్చి ఏడవటం మొదలెట్టింది.

ఆమె పైకి ఏడుస్తోంది. అతను లోపల్లోపలే ఏడుస్తున్నాడు. అందుకే ఆమెను

ఓదార్చలేకపోతున్నాడు. పంట బాగా పండితే ఈ ఏడాదే పిల్ల పెళ్లి చేసేద్దామనుకున్నారు. పంట బాగానే పండింది. కూరగాయల తోట కూడా విరగబూసి పూత పిందెమీద ఉంది.

రెండు గంటల తర్వాత పొలం పనులు ముగించుకుని ఇంటికి వచ్చేడు పెద్ద కొడుకు. విషయం తెలిసేక అతనూ బోరుమన్నాడు. ఏవిధంగానూ స్పందించని వాడూ, స్పందించినట్టు కన్పించనివాడూ చిన్నకొడుకు ఒక్కడే. అతను మౌనంగా ఏవేవో ఆలోచనల్లతో కొట్టుమిట్లాడుతున్నాడు.

నాలుగు రోజుల తర్వాత మళ్లీ ప్రభుత్వంవారి జీపువచ్చింది. అందులోంచి నలుగురు మనుషులు దిగేరు. గొలుసు పట్టుకుని మరో మనిషికూడా దిగేడు.

"ఎవురు బాబు మీరు?" అనడిగేడు మోటూనాయక్.

"సర్వే వాళ్లం. ఈ భూమిని సర్వే చేయటానికి వచ్చేం" అన్నాడు అందులో ఒకడు.

వాళ్లెవళ్లో, వాళ్లు చేస్తోన్న పనేవిటో అతనికి అక్కర్లేదు. అతనికి తెలీదు కూడాను. అతనికి తెలుస్తున్నదీ, స్పష్టంగా అర్థం అవుతోన్నదీ ఒక్కటే. వాళ్లు చేస్తోన్న హింసాకాండ. ఏపుగాపెరిగిన వంగ చెట్ల మధ్య నుంచి గొలుసు లాగుతోంటే, దాని తాకిడికి పూత, పిందె రాలిపోతోంది. కొన్ని చెట్లు విరిగి నేలకు ఒరిగిపోతున్నాయి. ఈ దృశ్యం చూసి ఇంటిల్లిపాదీ గొల్లున ఏడ్చేరు. ఆ తర్వాత జరిగిన హింసాకాండ మరింత ఘోరంగా ఉంది. కోతకు సిద్ధంగా ఉన్న వరి చేలో అడ్డం పడి గొలుసు లాగుతోంటే గింజ అంతా నేల రాలిపోతోంది.

విషయం అంతా చెప్పేరు చిన్న కొడుక్కి.

అంతా విని మౌనంగా ఉండిపోయేడు తప్ప ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

"బిడ్డ చచ్చినట్లు మేమంతా ఏడుస్తావుంటే మాటాడవేంట్రా?" అని విసుక్కున్నాడు మోటూనాయక్.

అప్పుడూ అతనేం మాట్లాడలేదు. విసురుగా ఇంట్లోంచి వెళ్లిపోయేడు. అంతే. ఆ తర్వాత నాలుగు రోజుల వరకూ అతను ఇంటికి తిరిగి రాలేదు. ఎక్కడికి పోయేడో, ఏం చేస్తున్నాడో వాళ్లెవళ్లకి అర్థం కాలేదు.

అయిదో రోజున పది మంది పటాలాన్ని వెంట బెట్టుకుని వచ్చేడు. వాళ్లని పొలం అంతా తిప్పి చూపించేడు. పూత రాలిన వంగ తోటనూ, గింజ రాలిన వరి చేనునూ చూసేరు వాళ్లు. తర్వాత అంతా కలిసి మోటూనాయక్ ఇంటికి వచ్చేరు. మోటూనాయక్

కుటుంబం అంతా చేతులు కట్టుకుని వాళ్ల ముందు నిలబడింది.

అప్పుడు కూడా పల్లెత్తు మాట మాట్లాడలేదు మోటూనాయక్ చిన్న కొడుకు. వాళ్లు మాత్రం -

"మేమంతా ప్రతిపక్ష నాయకులం. రేపు జరగబోయే ఆసెంబ్లీలో మీ తరుపున పోరాడతాం. మీకు న్యాయం జరిగేలా చూస్తాం" అని అభయమిచ్చేరు.

ప్రతిపక్ష నాయకులు హామీ రాజకీయ హామీలానే మిగిలిపోయింది. వారి ఉపన్యాసాలని ఖాతరు చెయ్యలేదు ముఖ్యమంత్రి.

"చిన్న పెద్ద తారతమ్యాలు మా ప్రభుత్వానికి లేవు. చిన్నయినా పెద్దయినా భూ బకాసురుల్ని క్షమించేది లేదు" అని ఘాటుగా చెప్పేడు ముఖ్యమంత్రి.

అనేకమంది రాజకీయ నాయకులు నగరంలో పలు చోట్ల ప్రభుత్వ భూముల్ని ఆక్రమించుకొన్నదృష్ట్యా ముఖ్యమంత్రి నిర్ణయం సబబుగానే అనిపించింది ప్రతిపక్షీయులకు. అందుకే మౌనంగా ఊరుకున్నారు.

ప్రభుత్వంవారు ప్రసాదించిన పది రోజుల గడువూ ముగిసిపోయింది. మోటూనాయక్ దిక్కు తోచని స్థితిలో ఉన్నాడు. భూమి ఖాళీ చేయకపోతే బుల్డోజరుతో ఇల్లు నేలమట్టం చేయిస్తానని బెదిరించిన ప్రభుత్వ అధికారి మాటలు అతని చెవిలో మారుమోగుతున్నాయి.

అర్ధరాత్రి దాటింది. అయినా చిన్నకొడుకు ఇంటికి రాలేదు. ఇంట్లో ఎవరూ నిద్రపోలేదు. తిండి తినలేదు. ఆ చీకటి రాత్రి... కీచురాళ్ల శబ్దం తప్ప మరేమి విన్పించటంలేదు. అరగంట గడిచేక ఏవో శబ్దాలు వినిపించేయి. గొడ్డలితో కట్టెలు కొడుతోన్న శబ్దం. అయినా ఎవరూ పట్టించుకోలేదు.

తెల్లవారింది.

మోటూనాయక్ ఉంటోన్న భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వ బలగం బయల్దేరింది. ముందు బుల్డోజరు, దాని వెనక లారీ-లారీ నిండా పోలీసు పటాలం. ఆ వెనక ప్రభుత్వం జీప్ - అందులో అధికార్లు... కార్వాన్ సాగిపోతోంది.

ఎత్తయిన కొండమీద, ఉన్నత భవనాల మధ్య నుంచి నున్నని తారు రోడ్డుమీదుగా సాగి లోయలోకి దిగింది కార్వాన్. అలా కొంత దూరం వెళ్లేక ముందు నడుస్తోన్న బుల్డోజరు చటుక్కున ఆగిపోయింది. దాని వెనక వున్న లారీకి సడెన్ బ్రేకు పడటంతో లారీకి గుద్దినంత పనిచేసి అకస్మాత్తుగా ఆగిపోయింది జీపు కూడా. లోకాభి రామాయణంలో ఉన్న ప్రభుత్వ అధికారులు ఆ కుదుపుతో అదిరిపడి ముందుకు

చూసేరు. లారీలోంచి పోలీసు బలగం కిందికి ఉరుకుతోంది.

అధికారుల గుండెలు దడదడలాడేయి.

"ఏవిటిది? ఏదో విపత్తు ముంచుకొచ్చినట్టుంది. ఎవరో దుండగులు అడ్డుకొన్నట్టున్నారు" అన్నాడు ఒక అధికారి.

వారం రోజుల క్రితమే అధికారుల్ని ఎత్తుకుపోయిన ఉదంతం గుర్తొచ్చి వణికిపోయేరు.

"నగరం మధ్యలో అలాంటిదేం జరక్కపోవచ్చు" అని ఓదార్చేడు ఒక ఉద్యోగి.

ఇంతలో బుల్డోజరు డ్రైవరు పరుగెత్తుకొచ్చేడు.

"ఏవిటి? ఏం జరిగింది?" అనడిగేరు అధికారులు ఏక కంఠంతో.

"బండి ఇంక ముందుకెళ్లదు సార్"

"ఎందుకని?"

"ముందు పెద్ద కయ్య ఉంది సార్"

"వంతెన వుందిగా!?"

"లేదు సార్"

ఒక అధికారి కిందికి దిగి వెళ్లి చూసేడు. అక్కడ వంతెన లేదు. వంతెన తాలూకు స్తంభాలు మాత్రమే ఉన్నాయి...!! ●

*(ఈనాడు, 3 డిసెంబరు 1995)*